

Registered No : APTEL/25/A0818

ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక

అదివారం 18-10-2026 | పేజీలు :4 | వెల :2 | సంపుటి :02 | సంచిక :122 | www.edhikadhanijam.com | ఎడిటర్ : బాలరాజు గౌడ్



కస్టడీలోనే అభిజిత్ దీపక్.. నేహా బోరా విడుదల!



నేహా బోరాకు పోలీసుల నుంచి విముక్తి

ఢిల్లీలో నిరసనల వేళ అరెస్టులు

తిరంగ యాత్రకు పోలీసుల అభ్యంతరం

నోటీసులు ఉల్లంఘించారని ఆరోపణ

మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చే యోచన

రూ.50 వేల పూచీకత్తుతో విడుదల

నామినేషన్ల వేళ ఉద్రిక్తత..

స్థానిక ఎన్నికల్లో హింసాత్మక ఘటనలు

పుంగనూరు, రాయచోటిలో మూడు కేసులు

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

ఫిర్యాదులపై తక్షణమే స్పందించిన ఎస్ఈసీ

తాడిపత్రిలో భారీగా పోలీసుల మోహరింపు

కడపలో వైసీపీ--టీడీపీ శ్రేణుల రాళ్లదాడి

నామినేషన్ కేంద్రం వద్ద కత్తిపోట్లు..



న్యూస్ డెస్క్, 17 అక్టోబర్ (ఇది కద నిజం): రాష్ట్రంలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ఉద్రిక్తతల మధ్య కొనసాగుతోంది. పలు ప్రాంతాల్లో చోటుచేసుకున్న ఘర్షణల నేపథ్యంలో ఎన్నికల సంఘం, పోలీసు యంత్రాంగం అప్రమత్తమయ్యాయి. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా కఠిన చర్యలు చేపట్టామని ఐజీ రాజకుమారి స్పష్టం చేయగా, హింసాత్మక ఘటనలను తీవ్రంగా పరిగణిస్తున్నట్లు ఎస్ఈసీ అనిల్‌చంద్ర పునేఠా వెల్లడించారు. మరోవైపు సమస్యాత్మక ప్రాంతంగా గుర్తింపు పొందిన తాడిపత్రిలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: ఐజీ రాజకుమారి

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎలాంటి హింసకు తావులేకుండా పటిష్ట చర్యలు చేపట్టామని ఐజీ రాజకుమారి తెలిపారు. పుంగనూరు, రాయచోటి ఘటనలపై ఇప్పటికే మూడు కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. కొందరు నిబంధనలను ఉల్లంఘించి రావడంతోనే అక్కడ ఘర్షణలు తలెత్తాయన్నారు. నిన్నటి ఘటనల నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా భద్రతను మరింత పెంచామని చెప్పారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా సున్నితమైన, సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశామని, చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడితే ఎవరినైనా బైండోవర్ చేస్తామని హెచ్చరించారు.

బీజేపీ రాజకీయాలకు ఈసీ వాడకం

నాకూ ఎస్ఐఆర్ నోటీసొచ్చింది

బీజేపీకి నచ్చని ఓట్ల తొలగింపు: మహేష్ గౌడ్

ఓటర్ల జాబితాపై కాంగ్రెస్ ఆగ్రహం

ఎస్ఐఆర్‌లో పారదర్శకత ఏదీ?

ఎన్నికల సంఘంపై మహేష్ గౌడ్ ఫైర్

సీఈసీ నియామకంపై కాంగ్రెస్ ప్రశ్నలు

ప్రజాస్వామ్యానికి ముప్పు: మహేష్ గౌడ్

2 లో

ప్రాణం తీసిన న్యూడుల్స్

నూడుల్స్ తిని ఐదుగురి మృతి

తెల్లారేసరికి విషాదంలో కుటుంబం

గ్రేటర్ నోయిడాలో కలకలం

మృతుల్లో ముగ్గురు చిన్నారులు

ఫుడ్ పాయిజనింగ్‌పై పోలీసుల అనుమానం

పరీక్షలకు ఆహార నమూనాలు

పోస్టుమార్టం నివేదిక కోసం ఎదురుచూపులు

గతంలో మహారాష్ట్ర ఘటనతో పోలిక



న్యూస్ డెస్క్, 17 అక్టోబర్ (ఇది కద నిజం): ఫాస్ట్ ఫుడ్, జంక్ ఫుడ్ ఆరోగ్యానికి మంచిది కాదని ఓవైపు వైద్యులు, ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నా.. ఒకట్రెండు సార్లు తింటే ఏమవుతుందిలే అన్న ధోరణిలో ఉంటున్నారు ప్రజలు. తాజాగా.. ఓ కుటుంబంలో ఐదుగురు.. న్యూడుల్స్ తిని నిద్రపోగా.. నిద్రలోనే మృత్యువొడికి చేరుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. గ్రేటర్ నోయిడాలో ఈ ఘటన చోటుచేసుకుంది. రబుపుర ప్రాంతానికి చెందిన కుటుంబం అనుమానాస్పద రీతిలో ప్రాణాలు కోల్పోగా.. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. మృతులను మహేష్ (37), లలిత (35), లడ్డు (11), మిష్టి (7), సాక్షాత్ (3)లుగా గుర్తించారు. గతరాత్రి వారంతా నూడుల్స్ తిని, టీ తాగి పడుకున్నట్లుగా మహేష్ తల్లి పోలీసులకు చెప్పారు.దీంతో ఫుడ్ పాయిజన్ అయి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

రాజస్థాన్‌లో ఘోర ప్రమాదం

లోయలో పడిన మినీబస్సు.. 8 మంది మృతి

ఢిల్లీ-ముంబై ఎక్స్‌ప్రెస్‌వేపై విషాదం

బురద కాలువలోకి దూసుకెళ్లిన బస్సు

వంతెనపై నుంచి పడిన మినీబస్సు

క్రేన్‌తో బస్సును బయటకు తీసిన సిబ్బంది

అసుపత్రికి క్షతగాత్రుల తరలింపు

2 లో

చంద్రబాబు ప్లాన్‌కు రేవంత్ సహకారం

తెలంగాణ నీళ్లపై కుట్రలు: హరీశ్

నీటి విషయంలో సర్కారు నిర్లక్ష్యం

దేవాదులలో మూడు మోటార్లే ఆన్

ఎల్‌నినో పేరుతో చేతులెత్తేశారు

గోదావరి జలాల తరలింపునకు యత్నాలు

కేసీఆర్ హయాంలో లేని ప్రతిపాదనలు

తెలంగాణ కరువుకు సీఎం కారణమని ఆరోపణ

2 లో

ఛత్తీస్‌గఢ్‌లో భూకంపం.. 3.5 తీవ్రత!



న్యూస్ డెస్క్, 17 అక్టోబర్ (ఇది కద నిజం): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో శనివారం భూమి స్వల్పంగా కంపించింది. అంబికాపూర్ నగరానికి ఉత్తర-వాయువ్యంగా దాదాపు 140 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమైన ఈ భూకంపం రిక్టర్ స్కేలుపై 3.5 తీవ్రతతో నమోదైందని నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ అధికారికంగా ధ్రువీకరించింది.

తీహార్ జైలులో సీజేపీ నేతలకు స్పెషల్ ట్రీట్‌మెంట్



తీహార్ జైలులో సీజేపీ నేతలకు ప్రత్యేక భద్రత

వేర్వేరు హైసెక్యూరిటీ వార్డులకు తరలింపు

సీసీటీవీలతో నిరంతర నిఘా

సూసైడ్ వాచ్‌లో ఇద్దరు నేతలు

ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీకి కోర్టు ఆదేశం

ఖైదీల కదలికలపై జైలు అధికారుల నజర్

తోటి ఖైదీని కలిసే విజ్ఞప్తికి నిరాకరణ



రెండు రాష్ట్రాలు భారీ అవకాశాలు!

న్యూస్ డెస్క్, 17 అక్టోబర్ (ఇది కద నిజం): తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలు పోటీపడే ధోరణికి స్వస్తి పలికి, పరస్పర సహకారంతో పారిశ్రామిక రంగంలో కొత్త అవకాశాలను సృష్టించుకోవాలని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్, పరిశ్రమలు, వాణిజ్య శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పిలుపునిచ్చారు. రెండు రాష్ట్రాల బలాలు ఒకే విలువ ఆధారిత పారిశ్రామిక గొలుసులోని రెండు భాగాల వంటివని పేర్కొన్నారు. బెంగళూరులోని ఆర్ట్రెజియా హోటల్‌లో కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) సహకారంతో నిర్వహించిన ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026 రోడ్‌షోలో మంత్రి మాట్లాడారు. కర్ణాటక పారిశ్రామికవేత్తలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని.. డిసెంబర్ 7 నుంచి 9 వరకు హైదరాబాద్‌లోని భారత్ ఫ్యూచర్ సిటీలో జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026లో పాల్గొనాలని ఆహ్వానించారు.

- పెట్టుబడులకు తెలంగాణే గమ్యం!
- రెండు రాష్ట్రాలు.. అపార అవకాశాలు!
- బెంగళూరు ఆలోచనలు.. హైదరాబాద్‌లో తయారీ!
- గ్లోబల్ కంపెనీలకు తెలంగాణ ఆహ్వానం!
- డిసెంబర్‌లో ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్!
- ఏరోస్పేస్ నుంచి ఏఐ వరకు.. కొత్త పుంతలు!
- తెలంగాణ రైజింగ్--2047 లక్ష్యమేంటి?
- ఫ్యూచర్ సిటీతో పారిశ్రామిక విప్లవం!

మిగతాది 2 లో..

జవాన్ల కోసం కేంద్రం కీలక ప్రతిపాదన!



న్యూస్ డెస్క్, 17 అక్టోబర్ (ఇది కద నిజం): దేశంలోనే అతిపెద్ద పారామిలిటరీ దళమైన సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్పీఎఫ్) కీలక నిర్ణయం దిశగా అడుగులు వేస్తోంది. దాదాపు 30 ఏళ్ల క్రితం రద్దు చేసిన ఆర్మీ ర్యాంకులైన 'లాన్స్ నాయక్', 'నాయక్' హోదాలను తిరిగి ప్రవేశపెట్టే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. సిబ్బందికి పదోన్నతులు ఆలస్యం కావడం, విధుల్లో అసంతృప్తిని తగ్గించడం, ఆర్మీ నుంచి పదవీ విరమణ చేసే అగ్నివీరులకు అవకాశాలు కల్పించడం ఈ ప్రతిపాదన వెనుక ప్రధాన ఉద్దేశంగా తెలుస్తోంది.ఈ మేరకు శనివారం అధికారుల ద్వారా ఈ వివరాలు వెల్లడైనట్లు జాతీయ మీడియా పేర్కొంది.

ఎల్‌నినోపై తెలంగాణ సర్కార్ అలర్ట్!

10 ఉమ్మడి జిల్లాలకు ప్రత్యేక ఐఏఎస్‌లు

తాగు, సాగునీటి కొరతపై ప్రత్యేక నజర్

వాతావరణ పరిస్థితులపై నిరంతర పర్యవేక్షణ

విద్యుత్ సరఫరాపై అధికారుల సమీక్ష

అత్యవసర పరిస్థితుల్లో తక్షణ చర్యలకు ఆదేశాలు

ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు నివేదికలు ఇవ్వాలి



న్యూస్ డెస్క్, 17 అక్టోబర్ (ఇది కద నిజం): రాష్ట్రంలో తీవ్రరూపం దాల్చుతున్న ఎల్ నినో ప్రభావం, తాగు, సాగునీటి కొరత , ముంచుకొస్తున్న వాతావరణ అత్యవసర పరిస్థితులను అధిగమించేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎల్ నినో పరిస్థితులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి, తగిన అత్యవసర చర్యలు చేపట్టేందుకు వీలుగా ఉమ్మడి పది జిల్లాలకు సీనియర్ ఐఏఎస్ అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

జిల్లాల వారీగా పర్యవేక్షణ బాధ్యతలను ప్రభుత్వం అనుభవజ్ఞులైన అధికారులకు అప్పగించింది.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
అదివారం 18-10-2026

జవాన్ల కోసం కేంద్రం కీలక ప్రతిపాదన!

మొదటి పేజీ తరువాయి



ఈ ప్రతిపాదనపై దేశవ్యాప్తంగా ఉన్న ఫీల్డ్ యూనిట్లు, బలగాల ప్రధాన కార్యాలయాలు భాగస్వామ్య సమావేశాలు లేదా 'సైనిక్ సమ్మేళనాలు' నిర్వహించి, సిబ్బంది అభిప్రాయాలను కేవలం రెండు రోజుల్లోగా సేకరించాలని సీఆర్పిఎఫ్ ప్రధాన కార్యాలయం ఆదేశించింది.

నేపథ్యం ఏమిటి?

సీఆర్పిఎఫ్లో గతంలో ఉన్న లాన్స్ నాయక్, నాయక్ హోదాలను 1997లో కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు రద్దు చేసి, వాటిని కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్ అనే పోలీసు హోదాలలో విలీనం చేశారు. అయితే, ఈ రెండు హోదాలు ఇప్పటికీ భారతీయ సైన్యంలో కొనసాగుతున్నాయి. అయితే ఆర్మీ నిబంధనల ప్రకారం ఒక జవాను కానిస్టేబుల్గా చేరిన తర్వాత 5 ఏళ్లకు లాన్స్ నాయక్, 10 ఏళ్లకు నాయక్, 20 ఏళ్లకు హెడ్ కానిస్టేబుల్ హోదా పొందుతాడు. ప్రస్తుతం సుమారు 3.25 లక్షల బలగంతో ఉన్న సీఆర్పిఎఫ్లో... కానిస్టేబుల్ స్థాయి సిబ్బందికి ప్రమోషన్ల విషయంలో తీవ్ర స్తబ్ధత నెలకొంది. ప్రస్తుతం ఒక కానిస్టేబుల్కు మొదటి ప్రమోషన్ రావడానికి సరాసరిగా 22 నుంచి 25 సంవత్సరాలు పడుతోంది. ఒక్కటే ర్యాంకులో దశాబ్దాల తరబడి కొనసాగడం వల్ల జవాన్లలో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ సమస్యను పరిష్కరించడానికి, హెడ్ కానిస్టేబుల్ స్థాయికి చేరేలోగా సిబ్బందికి మరో రెండు ప్రమోషన్లు కల్పించాలనే ఉద్దేశంతో లాన్స్ నాయక్, నాయక్ హోదాలను తిరిగి తీసుకురావాలని భావిస్తున్నారు. దీనివల్ల జవాన్ల నిరాశ తొలగిపోవడంతో పాటు వారిలో మనోధైర్యం పెరుగుతుందని అధికారులు తెలిపారు.

అగ్నివీరుల కోసమేనా?

కేంద్ర ప్రభుత్వ అగ్నిపథ్ పథకం కింద సైన్యంలో నాలుగేళ్ల కాలానికి రిక్రూటైన తొలి విడత 'అగ్నివీరులు' త్వరలో రిటైర్ కానున్నారు. రిటైరైన అగ్నివీరులు సీఆర్పిఎఫ్ తో పాటు ఇతర కేంద్ర సాయుధ పోలీసు బలగాలలో చేరేందుకు అర్హులు. సీఆర్పిఎఫ్ సర్వీసును వారికి మరింత ఆకర్షణీయంగా మార్చేందుకే ఈ మార్పులు చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం బలగాలలో అనధికారికంగా సీనియర్ కానిస్టేబుల్ హోదాను ఇస్తున్నారు గానీ నాయక్ హోదాకు ఎటువంటి ఏర్పాట్లు లేవు.

భిన్నాభిప్రాయాలు:

ఎక్స్-పారామిలటరీ పర్సనల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రణ్?బీర్ సింగ్ స్పందిస్తూ ఈ ప్రతిపాదిత విధానం వల్ల కాలానికి తగినట్లుగా ప్రమోషన్లు లభిస్తేనే జవాన్లకు మేలు జరుగుతుందని లేదంటే ఈ కసరత్తు వృథా అవుతుందని అభిప్రాయపడ్డారు. మరోవైపు ఈ హోదాల పునరుద్ధరణ కేవలం ఒక అలంకారిక చర్యగా ఉండకూడదని, బెటాలియన్ క్రమశిక్షణ, కార్యాచరణ సామర్థ్యం దెబ్బతినకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఒక సీనియర్ కమాండెంట్ పేర్కొన్నారు.

బీజేపీ రాజకీయాలకు ఈసీ వాడకం



న్యూస్ డెస్క్, 17 అక్టోబర్ (ఇది కద నిజం): ఎలక్షన్ కమిషన్ నిర్వహిస్తున్న 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' ప్రక్రియలో తీవ్ర లోపాలు ఉన్నాయని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ విధానంలో పారదర్శకత లోపించిందని, స్వయంగా తనకు కూడా నోటీసు వచ్చిందని ఆయన తెలిపారు. గాంధీ భవన్లో మీడియాతో మాట్లాడిన ఆయన, ఎన్నికల వ్యవస్థలో అవలంబించాల్సిన ప్రాథమిక నిబంధనలను విస్మరిస్తున్నారని ఆరోపించారు. 'ఎవరైనా వ్యక్తి మరణిస్తే ఓటు తొలగించాలి.. వేరే ప్రాంతానికి బదిలీ అయితే ఓటు మార్పిడి జరగాలి. కానీ, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి నచ్చని ఓట్లను ఏకపక్షంగా తోలిగించే కుట్ర జరుగుతోంది' అని విమర్శించారు.

ఎలక్షన్ కమిషన్ స్వతంత్రతపై ప్రశ్నలు..

ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన మహేష్ కుమార్ గౌడ్, ఇన్నాళ్లూ ఈడీ, సీబీఐ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను రాజకీయ ప్రత్యర్థులపై ప్రయోగించిన బీజేపీ, ఇప్పుడు కేంద్ర ఎన్నికల సంఘాన్ని కూడా తన రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటోందని ఆరోపించారు. ముఖ్యంగా కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ నియామక ప్రక్రియలో తెచ్చిన మార్పులను ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. సీఈసీ ఎంపిక కమిటీ నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ని ఎందుకు తొలగించారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. స్వతంత్ర వ్యవస్థల విధుల్లో కేంద్రం జోక్యం చేసుకోవడం ప్రజాస్వామ్యానికి తీవ్ర ముప్పు అని హెచ్చరించారు.

ప్రాణం తీసిన న్యూడుల్స్

మొదటి పేజీ తరువాయి



వారి మరణాలకు గల అసలు కారణం పోస్టుమార్టమ్ రిపోర్ట్ వచ్చాకే తెలుస్తుందని తెలిపారు. మరోవైపు ఫుడ్ సేఫ్టీ అధికారులు సైతం రంగంలోకి దిగారు. మహేష్ కుటుంబం చివరిగా నూడుల్స్ తిన్న శాంపిల్స్ ను సేకరించి టెస్టులకు పంపారు.

కొన్నినెలల క్రితం బిర్యానీ తిని, ఆ తర్వాత పుచ్చకాయ తిన్న కాసేపటికే ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మరణించిన విషయం తెలిసిందే. మహారాష్ట్రలో ఈ ఘటన జరగ్గా.. గ్రేటర్ నోయిడాలో జరిగిన తాజా సంఘటన ఆ మరణాలను గుర్తుచేస్తోంది. వారంతా ఫుడ్ పాయిజనింగ్ కారణంగానే మరణించినట్లు పోస్టుమార్టం రిపోర్టుల్లో తేలింది.

ఛత్తీస్గఢ్లో భూకంపం.. 3.5 తీవ్రత!



న్యూస్ డెస్క్, 17 అక్టోబర్ (ఇది కద నిజం): ఛత్తీస్గఢ్ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో శనివారం భూమి స్వల్పంగా కంపించింది. అంబికాపూర్ నగరానికి ఉత్తర-వాయువ్యంగా దాదాపు 140 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమైన ఈ భూకంపం రిక్టర్ స్కేలుపై 3.5 తీవ్రతతో నమోదైందని నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ అధికారికంగా ధ్రువీకరించింది. తెల్లవారుజామున 04:36 గంటల సమయంలో భూమి కంపించడంతో నిద్రలో ఉన్న ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. భూ అంతర్భాగంలో సంభవించిన ఈ స్వల్ప కుదుపుల వల్ల సమీప గ్రామాల్లోని ఇళ్ల లోని వస్తువులు స్వల్పంగా కదిలినట్లు సమాచారం అందింది.

అయితే, భూకంప తీవ్రత తక్కువగానే ఉండటంతో ప్రాణ నష్టం గానీ, ఆస్తి నష్టం గానీ సంభవించలేదని స్థానిక అధికార యంత్రాంగం స్పష్టం చేసింది. ఎలాంటి తీవ్రమైన ప్రమాదాలు జరగకపోవడంతో ఆ ప్రాంత ప్రజలు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. అప్రమత్తమైన రెవెన్యూ, విపత్తు నిర్వహణ బృందాలు క్షేత్రస్థాయి పరిస్థితులను సమీక్షిస్తున్నాయి. ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురి కావద్దని, పుకార్లను నమ్మవద్దని అధికారులు సూచించారు.

చంద్రబాబు ప్లాన్కు రేవంత్ సహకారం



న్యూస్ డెస్క్, 17 అక్టోబర్ (ఇది కద నిజం): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ సమాజానికి తీరని ద్రోహం చేస్తున్నారని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. మన ప్రాజెక్టుల్లో నీళ్లే లేకుండా చేసే కుట్రలు జరుగుతున్నాయని, ఎల్ నినో పేరుతో పూర్తిగా చేతులు ఎత్తేస్తున్నారని మండిపడ్డారు. అత్యంత ప్రాధాన్యత ఉన్న నీళ్ల విషయంలో ఎందుకు మీకు నిర్లక్ష్యం అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శనివారం తెలంగాణ భవన్ లో మీడియాతో మాట్లాడిన హరీశ్ రావు.. దేవాదులలో 10 మోటార్లు ఉన్నా మూడు మోటార్లే ఆన్ చేశారని, మేము అభ్యంతరాలు చెప్పిన తర్వాతే ఈ ప్రభుత్వం స్పందిస్తోందన్నారు. తెలంగాణలో ఈ కరువు పరిస్థితికి సీఎం రేవంత్ రెడ్డి కారణం అని హరీశ్ రావు ఆరోపించారు. తెలంగాణ కంటే ఏపీలో తక్కువ వర్షపాతం నమోదైంది. కానీ ఏపీలో కరువు, క్రాప్ హాలీడే లేదన్నారు.

చంద్రబాబుకు రేవంత్ సహకారం:

గోదావరిని కబళించే ప్రయత్నాలను చంద్రబాబు చేస్తున్నారని, గోదావరి-కావేరి లింక్ పేరుతో నీటిని తరలించే కుట్రలకు ప్రయత్నాలు జరుగుతుంటే ఇందుకు రేవంత్ రెడ్డి సహకరిస్తున్నారని ఆరోపించారు. గోదావరి-బనకచర్ల, గోదావరి-నల్లమలసాగర్ ప్రతిపాదనలు విఫలం అయ్యాయని ఇప్పుడు గోదావరి-కావేరీ పేరుతో ఇక్కడి జలాలు తరలించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. కేసీఆర్ సీఎంగా ఉన్నంత కాలం ఏపీ నేతలు ఏమీ మాట్లాడలేదని రేవంత్ రెడ్డి వచ్చాకే ఏపీ పాలకులు కొత్త ప్రతిపాదనలు తెస్తున్నారన్నారని విమర్శించారు.

రాజస్థాన్లో ఘోర ప్రమాదం



న్యూస్ డెస్క్, 17 అక్టోబర్ (ఇది కద నిజం): రాజస్థాన్లోని కోటా జిల్లా పరిధిలో శనివారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఢిల్లీ-ముంబై ఎక్స్ప్రెస్వేపై ప్రయాణిస్తున్న ఒక మినీ బస్సు అనియంత్రితంగా పక్కనే ఉన్న డ్రెయిన్ (లోతైన కాలువ)లోకి దూసుకెళ్లిన ఘటనలో 8 మంది ప్రయాణికులు అక్కడికక్కడే మృతి చెందారు. సిమ్లియా పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం వేకువజామున 6 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాద సమయంలో బస్సులో 25 మందికి పైగా ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం.

సుమారు 15 అడుగుల ఎత్తు ఉన్న వంతెన నుంచి బస్సు కింద ఉన్న బురద, నీటితో నిండిన డ్రెయిన్లో పడిపోవడంతో సహాయక చర్యలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న సహాయక బృందాలు, పోలీసులు క్రేన్ సహాయంతో బస్సును పైకి తీసి గాయపడిన ప్రయాణికులను బయటకు తీశారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదానికి గల పూర్తి కారణాలు, క్షతగాత్రుల వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

కస్టడీలోనే అభిజిత్ దీప్కే.. నేహా బోరా విడుదల!



న్యూస్ డెస్క్, 17 అక్టోబర్ (ఇది కద నిజం): ఢిల్లీలో సీజేపీ నిరసనల వేళ ఆ పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కేను శుక్రవారం సాయంత్రం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాగా ఇప్పటికీ దీప్కే పోలీసుల కస్టడీలోనే ఉన్నారు. శాంతి భద్రతల భంగం కింద సెక్షన్లు 126, 170 కింద దీప్కే ను పోలీసులు అరెస్ట్ చేసినట్లు తెలుస్తోంది. అతడిని స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చబోతున్నట్లు సమాచారం. కానాట్ ప్లేస్లోని సెంట్రల్ పార్క్ వద్ద దీప్కే లెఫ్రో దో తిరంగా (తిరంగ యాత్ర) నిరసనకు దీప్కే పిలుపునివ్వగా, నిరసన చేపటొద్దని నోటీసులు ఇచ్చినప్పటికీ అతడు వాటిని పాటించడంలో విఫలం అయ్యాడని చెబుతున్నారు.

గతంలో జరిగిన అరెస్ట్ సమయంలో శాంతి ఒప్పందంలోని షరతులను దీప్కే ఉల్లంఘించారని పోలసులు మెజిస్ట్రేట్ ముందు చెప్పనున్నారు. దీప్కేను రూ.50వేల పూచీకత్తుతో విడిచిపెట్టినట్లు తెలిపారు. ఏడాది పాటు ప్రజాశాంతికి భంగం కలిగించవద్దని అతడిని ఆదేశించినట్లు చెప్పారు. మరోవైపు ఏఐఎస్ఏ అధ్యక్షురాలు నేహా బోరాను విడిచిపెట్టినట్లు పోలీసులు తెలిపారు. ఇద్దరిని శుక్రవారం సాయంత్రం అదుపులోకి తీసుకోగా నేహాబోరాను అదేరోజు సాయంత్రం విడిచిపెట్టినట్లు చెప్పారు.

ఎల్నినోపై తెలంగాణ సర్కార్ అలర్ట్!

మొదటి పేజీ తరువాయి

ఉమ్మడి హైదరాబాద్ జిల్లాకు జయేష్ రంజన్, రంగారెడ్డి జిల్లాకు వికాస్ రాజ్, కరీంనగర్ జిల్లాకు బెనహర్ మహేష్ దత్తా ఎక్కా, మెదక్ జిల్లాకు ఎ. వాణి ప్రసాద్ ప్రత్యేక అధికారులుగా వ్యవహరిస్తారు. అలాగే నిజామాబాద్ జిల్లాకు యోగితా రాణా, నల్గొండ జిల్లాకు హరిచందన దాసరి, ఆదిలాబాద్ జిల్లాకు ఇలాంబర్తి కె., వరంగల్ జిల్లాకు ఎ. శ్రీదేవిసేన, మహబూబ్నగర్ జిల్లాకు వి.పి. గౌతమ్, ఖమ్మం జిల్లాకు అనుదీప్ దురిశెట్టి నియమితులయ్యారు.

క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ, కార్యాచరణ

నియమితులైన ప్రత్యేక ఐఏఎస్ అధికారులు తమకు కేటాయించిన ఉమ్మడి జిల్లాల్లో నిరంతరం పర్యటిస్తూ ప్రతికూల వాతావరణ పరిస్థితులు, తాగునీటి ఎద్దడి, సాగునీటి లభ్యత, వర్షపాతం నమోదు స్థితిగతులను సమీక్షిస్తారు. వీటితో పాటు వ్యవసాయం, గృహ అవసరాలకు అందుతున్న విద్యుత్ సరఫరా తీరుపై క్షేత్రస్థాయి యంత్రాంగాన్ని సమన్వయం చేస్తారు. ఎలాంటి అత్యవసర పరిస్థితి తలెత్తినా తక్షణ ఉపశమన చర్యలు చేపట్టడంతో పాటు, ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు సమగ్ర నివేదికలు అందించేలా కార్యాచరణను సిద్ధం చేశారు.

నామినేషన్ల వేళ ఉద్రిక్తత.. రంగంలోకి ఎస్ఈసీ!

మొదటి పేజీ తరువాయి

రాజకీయ పార్టీల ఫిర్యాదులపై ఎస్ఈసీ తక్షణ స్పందన

రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితిపై వివిధ రాజకీయ పార్టీల నేతలు తనను కలిసి ఫిర్యాదు చేశారని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్చంద్ర పునేఠా తెలిపారు. పార్టీల నుంచి అందిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి, ఆయా జిల్లాల కలెక్టర్లకు సమాచారం అందించామని, తక్షణమే పరిస్థితులను అదుపులోకి తీసుకువచ్చామని పేర్కొన్నారు. హింసాత్మక ఘటనలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు ఉంటాయని, అవసరమైన చోట అదనపు బలగాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ముఖ్యంగా నామినేషన్ కేంద్రాల వద్ద అదనపు భద్రత కల్పిస్తున్నట్లు ఎస్ఈసీ వెల్లడించారు.

తాడిపత్రిలో ఉద్రిక్త వాతావరణం.. భారీగా పోలీసుల మోహరింపు

నామినేషన్ల ఘట్టం మునుగుతున్న వేళ అనంతపురం జిల్లాలోని సమస్యాత్మక ప్రాంతమైన తాడిపత్రిలో పోలీసులు భారీగా మోహరించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా మున్సిపల్ ఆఫీస్ చుట్టూ ఇనుప కంచెలను ఏర్పాటు చేయడంతో పాటు, వజ్ర వాహనం, బాష్పవాయువు గోళాలను సిద్ధంగా ఉంచారు. అలాగే, నామినేషన్ల దాఖలు కోసం టీడీపీ, వైఎస్సార్సీపీ అభ్యర్థులకు ఎలాంటి ఘర్షణలు తలెత్తకుండా వేర్వేరు గదులను కేటాయించారు. ఎన్నికల ప్రశాంత వాతావరణంలో ముగిసేలా అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మరోవైపు కడపలో వైసీపీ - టీడీపీ శ్రేణులు రాళ్లదాడి చేసుకున్నారు. మూడు వాహనాలు ధ్వంసమవ్వగా.. జిల్లాలోని మరియాపురం నామినేషన్ కేంద్రం వద్ద వైసీపీ మాజీ డిప్యూటీ మేయర్ తనయుడికి కత్తిపోట్లు దిగాయి.

తీహార్ జైలులో సీజేపీ నేతలకు స్పెషల్ ట్రీట్మెంట్



న్యూస్ డెస్క్, 17 అక్టోబర్ (ఇది కద నిజం): ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఎలాంటి అనుమతి లేకుండా ప్రవేశించారనే ఆరోపణలతో అరెస్టయిన 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) నేతలు అశుతోష్ రంకా, సౌరవ్ దాస్లను తీహార్ జైలులో ఉన్న విషయం తెలిసిందే. ఈ జైల్లో సీజేపీ నాయకులకు స్పెషల్ ట్రీట్మెంట్ ఇస్తారట. అంటే.. వీరిని ప్రత్యేక హై-సెక్యూరిటీ వార్డుల్లో వేర్వేరుగా ఉంచారట. ఇందుకు సంబంధించి అధికారుల నుంచి పూర్తి వివరాలు తెలిశాయి.

అక్టోబర్ 14న శాంతిభద్రతలకు భంగం కలిగించేలా పదే పదే ప్రయత్నించారన్న అభియోగాలతో ఢిల్లీ పోలీసులు వీరిద్దరినీ అరెస్టు చేశారు. ఒకవేళ వీరికి బెయిల్ ఇస్తే మళ్లీ చట్టాన్ని ఉల్లంఘించి ఇతరులను రెచ్చగొట్టే అవకాశం ఉందన్న బలమైన అనుమానంతో, కోర్టు వీరిని ఐదు రోజుల పాటు జ్యుడీషియల్ కస్టడీకి తరలించింది. ఆ తర్వాతే వీరు తీహార్ జైలుకు వెళ్లాల్సి వచ్చింది. ఇక, జైలు రికార్డుల ప్రకారం.. అశుతోష్ రంకా ఖైదీ నంబర్ 1784 కాగా, సౌరవ్ దాస్ ఖైదీ నంబర్ 3752. మొదట వీరిద్దరినీ జైలు నంబర్ 2లోనే ఉంచారు. కానీ ఆ తర్వాత అశుతోష్ రంకాను జైలు నంబర్ 4కి మార్చారు. ప్రస్తుతం సౌరవ్ దాస్ జైలు నంబర్ 2లోని వార్డ్ నంబర్ 3లో ఉండగా, రంకా జైలు నంబర్ 4లోని వార్డ్ నంబర్ 15లో ఉన్నారు. మిగతా బ్లాక్లతో పోలిస్తే వీరు ఉన్న బ్లాక్లలో కొంచెం ఫ్రీగా ఉంటుందట.

ఈ వార్డులు చాలా ప్రత్యేకమైనవని జైలు వర్గాలు తెలిపాయి. వేరే వార్డులకు చెందిన ఏ ఖైదీని కూడా ఈ వార్డులలోకి అస్సలు రానివ్వరు. వీరి కదలికలను నిరంతరం గమనించేందుకు సెల్స్లోనే సీసీటీవీ కెమెరాలను అమర్చారు. అంతేకాకుండా రౌండ్-ది-క్లాక్ వీరిని సూసైడ్ వాచ్ (ఆత్మహత్య నిఘా) కింద ఉంచినట్లు ఓ అధికారి జాతీయ మీడియా సంస్థకు వెల్లడించారు. గురువారం నాడు సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, ఆ పార్టీ లీగల్ హెడ్ రత్న సింగ్ వీరిని కలిసి పలకరించారు. సౌరవ్ దాస్ ఉన్న జైలు నంబర్ 2లోనే గతంలో ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ను ఉంచారు. అలాగే, ప్రస్తుతం జేఎన్యూ మాజీ విద్యార్థి, ఆందోళనకారుడు ఉమర్ ఖాలిద్ కూడా వేరే హై-రిస్క్ సెల్లో ఇదే జైలులో ఉన్నారు. ఇక రంకాను ఉంచిన జైలు నంబర్ 4ను గతంలో జైలు అధికారులు విపాసన ధ్యాన కార్యక్రమాల కోసం ఉపయోగించేవారట. అలాగే ఆయుధాల వ్యాపారి అభిషేక్ వర్మ కూడా గతంలో ఇక్కడే ఉన్నారట. ఈ జైలు జీవితంలో వీరిద్దరూ ఎలాంటి ప్రత్యేక సౌకర్యాలు కోరలేదు. అయితే, వారిలో ఒకరు మాత్రం తోటి ఒక తోటి ఖైదీని కలిసేందుకు అనుమతివ్వాలని జైలు అధికారులను మౌఖికంగా కోరాడట. ఆ విజ్ఞప్తిని అధికారులు తిరస్కరించినట్లు తెలుస్తోంది.

రెండు రాష్ట్రాలు.. భారీ అవకాశాలు!

మొదటి పేజీ తరువాయి

కర్ణాటక నుంచి ఏదైనా తీసుకెళ్లాలనే ఉద్దేశంతో తాము బెంగళూరుకు రాలేదని.. కర్ణాటకకు అద్భుతమైన బలాలు ఉన్నాయని.. తెలంగాణకు ప్రత్యేకమైన సామర్థ్యాలు ఉన్నాయని చెప్పారు. ఈ రెండు రాష్ట్రాలు కలిసి పనిచేస్తే దేశ పారిశ్రామిక అభివృద్ధికి మరింత దోహదపడవచ్చని పేర్కొన్నారు. కర్ణాటక విజ్ఞాన, పారిశ్రామిక వారసత్వాన్ని ప్రస్తావించిన మంత్రి, బెంగళూరు దేశంలోనే ప్రముఖ స్టార్టప్ కేంద్రంగా, ఏరోస్పేస్, అంతరిక్ష రంగాల్లో కీలక నగరంగా ఎదిగిందని పేర్కొన్నారు. హెచ్ఏఎల్, ఇస్రో, ఎన్ఏఎల్ వంటి సంస్థలు ఈ రంగాల్లో దేశానికి విశేష సేవలందిస్తున్నాయని చెప్పారు.

బెంగళూరులో విమాన ఇంజిన్ల రూపకల్పన జరిగితే, హైదరాబాద్లోని ఏరోస్పేస్ పార్కుల్లో వాటి విడిభాగాల తయారీ చేపట్టవచ్చని వివరించారు. అదేవిధంగా బెంగళూరులో పరిశోధనల ద్వారా అభివృద్ధి చేసే టీకాలను తెలంగాణలోని జీనోమ్ వ్యాలీలో భారీ స్థాయిలో ఉత్పత్తి చేయవచ్చన్నారు. ప్రపంచ టీకాల ఉత్పత్తిలో జీనోమ్ వ్యాలీకి కీలక స్థానం ఉందని పేర్కొన్నారు. బెంగళూరులో చిప్ల రూపకల్పన, తెలంగాణలో ఎలక్ట్రానిక్స్ తయారీ, తెలంగాణ పత్తితో వస్త్రాల తయారీ, అంతర్జాతీయ బ్రాండ్లకు సరఫరా వంటి రంగాల్లో రెండు రాష్ట్రాల పరిశ్రమలు పరస్పరం సహకరించుకోవచ్చని సూచించారు. బెంగళూరులో ఇప్పటికే కార్యకలాపాలు నిర్వహిస్తున్న అంతర్జాతీయ సంస్థలు హైదరాబాద్లోనూ తమ కేంద్రాలను ఏర్పాటు చేసుకోవచ్చని అన్నారు. ఐఐఎస్సీ, ఐఐటీ హైదరాబాద్, ఐఎస్బీ, ఐఐఐటీ వంటి విద్యాసంస్థల నుంచి లభించే నైపుణ్యం, టీ-హబ్ స్టార్టప్ల సామర్థ్యాలు పెట్టుబడిదారులకు ప్రయోజనకరంగా ఉంటాయని వివరించారు. జీనోమ్ వ్యాలీ లైఫ్ సైన్సెస్ రంగంలో కీలక కేంద్రంగా నిలవగా, రాష్ట్రంలోని ఏరోస్పేస్ పార్కుల్లో అంతర్జాతీయ సంస్థలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని చెప్పారు.

ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి నాయకత్వంలో అమలవుతున్న తెలంగాణ రైజింగ్-2047 దార్శనికతలో భాగంగా 2034 నాటికి లక్ష కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. భారత్ ఫ్యూచర్ సిటీని నెట్-జీరో గ్రీన్ఫీల్డ్ నగరంగా అభివృద్ధి చేయడం, ఏఐ సిటీ, ప్రత్యేక మొబిలిటీ వ్యాలీ ఏర్పాటు, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, రీజినల్ రింగ్ రోడ్, కొత్త పారిశ్రామిక కారిడార్లు, మూసీ పునరుజ్జీవన కార్యక్రమం వంటి ప్రాజెక్టులు రాష్ట్ర అభివృద్ధికి దోహదపడతాయని వివరించారు. ప్రాంతాల వారీగా అభివృద్ధి సాధించేందుకు రూపొందించిన క్యూర్-ప్యూర్-రేర్ విధానాన్ని కూడా వివరించారు.

సీఈసీని వెంటనే తొలగించాలి.. డీఎంకే తీర్మానం..



న్యూస్ డెస్క్, 17 అక్టోబర్ (ఇది కద నిజం): తమిళనాడు లోని ప్రతిపక్ష డీఎంకే పార్టీ కేంద్ర ఎన్నికల సంఘంపై, ఎన్నికల ప్రక్రియపై తీవ్ర అసంతృప్తి వెళ్లగక్కింది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ను వెంటనే పదవి నుంచి తొలగించాలని, ఈవీఎంల స్థానంలో తిరిగి బ్యాలెట్ విధానాన్నే ప్రవేశపెట్టాలని ఆ పార్టీ ఎంపీలు డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పూర్తిగా రద్దు చేయాలని కూడా తీర్మానించారు.

శనివారం ఉదయం 11 గంటలకు చెన్నైలోని పార్టీ ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయంలో డీఎంకే అధినేత, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అధ్యక్షతన పార్టీ పార్లమెంటరీ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మొత్తం నాలుగు కీలక తీర్మానాలను ఆమోదించారు. ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయని, వాటిని సరిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ భారత రాష్ట్రపతికి వినతిపత్రం సమర్పించాలనేది వాటిలో ఒకటి.

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ను వెంటనే తొలగించాలనేది వాటిలో తొలి తీర్మానంగా ఉన్నది. ఎన్నికల నిర్వహణలో ఆయన వైఫల్యం చెందారని ఆరోపిస్తూ.. ఆయనను వెంటనే తొలగించాలని ఆ తీర్మానంలో డిమాండ్ చేశారు. అయితే ఎలాంటి అవకతవకలు జరిగాయనేది మాత్రం పార్టీ విడుదల చేసిన ప్రకటనలో స్పష్టంగా పేర్కొనలేదు. అయితే రాష్ట్రపతికి సమర్పించే వినతిపత్రంలో పూర్తి వివరాలు పొందుపరచనున్నట్లు తెలుస్తున్నది.

విద్యార్థి సంఘాలు నిర్వహిస్తున్న నిరసనలకు మద్దతు తెలుపుతూ డీఎంకే మరో తీర్మానం చేసింది. అయితే ఏ విద్యార్థి సంఘాలకు వారు మద్దతిస్తున్నారో స్పష్టంగా తెలియజేయలేదు. ఇక కాంగ్రెస్, అధికార టీవీకే పార్టీల ద్వంద్వ వైఖరిని ఖండిస్తూ మూడో తీర్మానం చేసింది. ఏయే అంశాల్లో ఈ పార్టీలు ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తున్నాయో కూడా తీర్మానంలో వివరించలేదు. ఎన్నికల ప్రక్రియలో సంస్కరణలు తీసుకురావాలని రాష్ట్రపతిని కోరుతూ నాలుగో తీర్మానం చేశారు.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
అదివారం 18-10-2026

పులుమామిడిలో వైభవంగా బతుకమ్మ వేడుకలు





ఇది కద నిజం,పులుమామిడి, అక్టోబర్ 17: తెలంగాణ సాంస్కృతిక ప్రతీక అయిన బతుకమ్మ వేడుకలు పులుమామిడి గ్రామంలో అత్యంత ఘనంగా, కన్నుల పండువగా జరిగాయి . ఎంగిలిపూల బతుకమ్మతో మొదలైన ఈ వేడుకలు సద్దుల బతుకమ్మ వరకు గ్రామంలో పండుగ వాతావరణాన్ని తలపించేలా సాగాయి. గ్రామంలోని మహిళలు, యువతులు తంగేడు, గునుగు, బంతి వంటి రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చారు. సాయంత్రం వేళ అందరూ ఒకచోట చేరి సాంప్రదాయ ఉయ్యాల పాటలు పాడుతూ, కోలాటాలు ఆడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. గ్రామంలోని వీధులన్నీ ఆడపడుచుల ఆటపాటలతో, పూల సువాసనలతో కళకళలాడాయి. ఈ వేడుకల్లో పులుమామిడి గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, గ్రామ పెద్దలు, అడపడుచులు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొని బతుకమ్మ సంబురాలను విజయవంతం చేశారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించేలా సాగిన ఈ వేడుకలు గ్రామస్థులందరిలోనూ నూతనోత్సాహాన్ని నింపాయి.

రాంపూర్‌లో ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు













ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ పిట్లం: కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలోని రాంపూర్ గ్రామంలో శనివారం సద్దుల బతుకమ్మ పండుగ సంబరాలను మహిళలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను గ్రామ మహిళలు భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి, సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ వేడుకల్లో పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్ అనిత ఆధ్వర్యంలో బతుకమ్మ నిమజ్జన కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లు చేశారు. మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిమజ్జన ప్రాంతంలో లైటింగ్‌తో పాటు అవసరమైన మౌలిక వసతులు కల్పించారు. పండుగ సందర్భంగా మహిళలు సౌకర్యవంతంగా బతుకమ్మ నిమజ్జనం చేసుకునేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొనగా, మహిళలు ఉత్సాహంగా బతుకమ్మ వేడుకల్లో పాల్గొని సంప్రదాయాలను కొనసాగించారు. ఈ కార్యక్రమంలో బల్రాం రెడ్డి, బాల్‌రెడ్డి, సీఓ సంతోష్ రెడ్డి, గ్రామ పెద్దలు, మహిళలు, గ్రామ పాల్గొన్నారు.

గౌరారంలో ఘనంగా దుర్గామాతకు ప్రత్యేక పూజలు









ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పిట్లం: కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలోని గౌరారం గ్రామంలో నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కొలువుదీరిన దుర్గామాతకు పండితులు శ్యామ్ పంతులు గ్రామ సర్పంచ్ లోకి హనుమంతరావు ఆధ్వర్యంలో అమ్మవారికి నైవేద్యం ప్రత్యేక పూజలు కొత్త గాజులు సమర్పించి అమ్మవారి దగ్గర పూజ చేసుకున్న గాజులు మహిళలకు అందరికీ అందజేశారు. ప్రత్యేక పూజలు, అర్చనలు, కుంకుమార్చనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా రవి--భాగ్యలక్ష్మి దంపతులు, శంకర్--లక్ష్మి దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ పూజా కార్యక్రమాల్లో గ్రామానికి చెందిన మహిళలు, భక్తులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని దుర్గామాతను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అమ్మవారి నామస్మరణతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తులు అమ్మవారి కృపాకటాక్షాలు గ్రామ ప్రజలందరిపై ఉండాలని, గ్రామం సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు.

సర్వోత్తమ రెడ్డి గెలుపుకు కృషి చేయండి

:ఎంపీ(రామసహాయం రఘు రామరెడ్డి)



సత్తుపల్లి,ఆర్ సి,అక్టోబర్17(ఇది కద నిజం) న్యూస్:

సత్తుపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ ఆధ్వర్యంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ పాల్గొని కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమరెడ్డి విజయానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని సూచించారు. అర్హులైన పట్టభద్రులను నవంబర్ 6లోగా ఆన్‌లైన్‌లో ఓటర్లుగా నమోదు చేయించాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా గాదెపాక కిరణ్ ఏకగ్రీవ ఎన్నిక

- ప్రధాన కార్యదర్శిగా లకావత్ నాగరాజు నాయక్.. గ్రామాల అభివృద్ధికి సమష్టి కృషి చేస్తాం

జనగామ జిల్లా, ఇది కద నిజం న్యూస్ అక్టోబర్ 17



జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు ఉప సర్పంచ్‌ల ఫోరం ఎన్నికలు నిర్వహించారు.ఈ ఎన్నికల్లో పాలకుర్తి మేజర్ గ్రామపంచాయతీ ఉప సర్పంచ్ గాదెపాక కిరణ్‌ను ఫోరం అధ్యక్షుడిగా, లకావత్ నాగరాజు నాయక్‌ను ప్రధాన కార్యదర్శిగా సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.మండలంలోని ఉప సర్పంచ్‌లందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి, గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, గ్రామపంచాయతీల బలోపేతం లక్ష్యంగా ఫోరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.గ్రామస్థాయిలో ఉప సర్పంచ్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, గ్రామాల అభివృద్ధికి అవసరమైన చర్యల కోసం సమష్టిగా కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు. ఉప సర్పంచ్‌ల హక్కులు, బాధ్యతలపై అవగాహన పెంపొందించేందుకు కూడా ఫోరం ప్రాధాన్యత ఇవ్వనుంది.నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు గాదెపాక కిరణ్, ప్రధాన కార్యదర్శి లకావత్ నాగరాజు నాయక్ మాట్లాడుతూ, మండలంలోని ఉప సర్పంచ్‌లందరినీ సమన్వయం చేసుకుంటూ గ్రామాల అభివృద్ధి కోసం ఐకమత్యంతో పనిచేస్తామని తెలిపారు.ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కార మార్గాలను అన్వేషిస్తూ, గ్రామస్థులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని వెల్లడించారు.ఫోరం గౌరవ అధ్యక్షులుగా జంపాల పుష్పలీల, అంజయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బేజాడి సురేష్, ఉపాధ్యక్షులుగా పూజారి సురేష్, గోనె మహేందర్, కోశాధికారిగా కత్తుల ఎల్లయ్య, ప్రచార కార్యదర్శిగా మారేపల్లి బిక్షపతి, సంయుక్త కార్యదర్శులుగా పడిసే అశోక్, గుగులోత్ కమలమ్మ, వాసు నాయక్ ఎన్నికయ్యారు.ఫోరం సభ్యులుగా లకావత్ వెంకన్న నాయక్, భూక్యా సురేష్ నాయక్, భూక్యా సంగీత, నరేష్ నాయక్, బానోత్ వీరన్న నాయక్, లకావత్ బాలు నాయక్, దాసరి ఉప్పలయ్య తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

బాసర ట్రిపుల్ ఐటీ సీటు సాధించిన తులసి కు అభినందనలు తెలిపిన మువ్వా"

సత్తుపల్లి,ఆర్ సి,అక్టోబర్ 17, (ఇది కద నిజం) న్యూస్:



పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి, యూపీఎస్ పాఠశాల నుంచి బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన తులసిని మాజీ టిజిఐడిసి చైర్మన్ మువ్వా విజయబాబు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తులసిని అభినందించి, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆయన సూచించారు. తులసి తల్లిదండ్రులు చింతల వాసు, సునీత తమ కుమార్తె సాధించిన విజయం పై ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తులసి కి పలువురు అభినందనలు తెలిపారు.

మా గ్రామాభివృద్ధికి మీ నిధులివ్వండి ఎంపీ సారు మహమ్మద్ ఫక్రుద్దీన్ అలీగ్రామ సర్పంచ్)



సత్తుపల్లి/వేంసూరు, అక్టోబర్17(ఇది కద నిజం) న్యూస్: శనివారం సత్తుపల్లికి వచ్చిన ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డిని వేంసూరు గ్రామ సర్పంచ్ మహమ్మద్ ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ కలిసి తమ గ్రామ అభివృద్ధికి ఎంపీ నిధులు కేటాయించాలని కోరారు.దీనిపై ఎంపీ సానుకూలంగా స్పందించారు.కేటాయిస్తామని హామీ ఇచ్చారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల వ్యూహాలపై కూడా చర్చించారు.ఈ కార్యక్రమంలో: ఎమ్మెల్యే మట్టా రాగమయి,మట్టా దయానంద్,మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, ఉపసర్పంచ్ ఈడా ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

నూతన ఎస్సై బొల్లం వినయ్ కుమార్‌కు ఘన స్వాగతం

ఇది కద నిజం న్యూస్ జఫర్‌గఢ్ అక్టోబర్ 17



జఫర్‌గఢ్ మండల నూతన ఎస్సైగా పదవీ బాధ్యతలు స్వీకరిస్తున్న బొల్లం వినయ్ కుమార్‌కు కాంగ్రెస్ పార్టీ నాయకులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా స్టేషన్ ఘన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఇల్లందుల బాబు నూతన ఎస్సై బొల్లం వినయ్ కుమార్‌ను శాలువాతో ఘనంగా సన్మానించి, పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, మండలంలో శాంతిభద్రతల పరిరక్షణలో సమర్థవంతంగా విధులు నిర్వహించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బతుకమ్మ సంబరాలకు నారాయణగిరి ముస్తాబు

- ఆట ప్రాంగణాన్ని శుభ్రం చేయించిన సర్పంచ్ పుట్ట రేణుక కుమారస్వామి



ధర్మసాగర్, అక్టోబర్ 17(ఇది కద నిజం): ధర్మసాగర్ మండలం నారాయణగిరి గ్రామంలో బతుకమ్మ పండుగను పురస్కరించుకుని ఆట ప్రాంగణాన్ని శుభ్రం చేయించి సిద్ధం చేశారు. గ్రామ సర్పంచ్ పుట్ట రేణుక కుమారస్వామి ఆధ్వర్యంలో ప్రాంగణాన్ని పరిశుభ్రం చేసి,మహిళలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బతుకమ్మ వేడుకల్లో పాల్గొనేలా ఏర్పాట్లు చేశారు.పండుగకు వచ్చే మహిళలు,గ్రామ ప్రజలకు అసౌకర్యం కలగకుండా పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇచ్చారు.గ్రామ ప్రజలంతా ఆనందోత్సాహాల మధ్య బతుకమ్మ పండుగను జరుపుకునేలా ఏర్పాట్లు పూర్తి చేశారు.

పచ్చగన్నేరు గుంటను పరిశీలించిన సబ్ కలక్టర్"

సొమ్ము చెల్లించకుండా రైతాంగానికి సాగు నీళ్లు సరఫరా చేయాలని ఆదేశాలు"



సత్తుపల్లి/వేంసూరు, అక్టోబర్17(ఇది కద నిజం) న్యూస్:

సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండల కేంద్రంలోని పచ్చగన్నేరు కుంట చెరువులో గల సాగునీటిని ఎటువంటి సొమ్ము చెల్లించకుండా వరి పొట్టదశలో ఉండి ఎండిపోతున్న రైతాంగానికి సరఫరా చేయాలని కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ ఇరిగేషన్ శాఖ డివిజనల్ ఇంజినీర్ మరియన్న ను ఆదేశించారు.శనివారం రైతుల పిర్యాదు మేరకు సబ్ కలక్టర్ కుంటను పరిశీలించారు.ప్రతి రైతు నుండి ఐదువేలు చొప్పున మరమ్మతుల కొరకు ఇవ్వాలని కమిటి వారు అడుగుతున్నారని రైతులు ఆరోపించారు.ఈ కార్యక్రమంలో: వేంసూరు సహకార సంఘం అధ్యక్షులు తక్కెళ్లపాటి గోపాలకృష్ణ,రైతులు బొంతు భాస్కర్,కొత్తా సత్యనారాయణ,బొంతు విజయలక్ష్మి,గిరిదావర్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యాలయంలోకి తాచు పాము"తప్పించుకున్న కార్యదర్శి"



సత్తుపల్లి,ఆర్ సి,అక్టోబర్17(ఇది కద నిజం) న్యూస్: సత్తుపల్లి మండలం సదాశివునిపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం త్రాచుపాము కలకలం సృష్టించింది. విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శి వేము రామకృష్ణ కూర్చున్న ప్రదేశానికి సమీపంలోకి పాము రావడంతో ఆయన అప్రమత్తమై వెంటనే పక్కకు తప్పుకున్నారు.దీంతో తృటిలో పెను ప్రమాదం తప్పింది. కార్యదర్శి సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు.లేటుగా విషయం వెలుగులోకి వచ్చింది.

ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సమక్షంలో టీడీపీలో చేరిన గుత్తి మాజీ కౌన్సిలర్ వాల్మీకి శివ

ఇది కద నిజం న్యూస్, గుంతకల్లు.



గుంతకల్లు నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కి గట్టి షాక్ తగిలింది. గుత్తి మునిసిపాలిటీ 21వ వార్డుకు చెందిన మాజీ కౌన్సిలర్ వాల్మీకి శివ అధికార తెలుగుదేశం పార్టీ లో చేరారు.గుంతకల్లు నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ గుమ్మనూరు జయరాం మరియు ఆయన తనయుడు యువనేత పామిడి గుత్తి నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీ గుమ్మనూరు ఈశ్వర్ సమక్షంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఈ చేరిక కార్యక్రమం జరిగింది.వాల్మీకి శివకు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం స్వయంగా పసుపు కండువా కప్పి పార్టీలోకి సాధరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా వాల్మీకి శివ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలన ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలతో పాటు గుంతకల్లు నియోజకవర్గంలో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితుడనై టీడీపీలో చేరినట్లు ప్రకటించారు. నియోజకవర్గ అభివృద్ధిలో భాగస్వామిని కావడమే తన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గుత్తి పట్టణానికి చెందిన పలువురు ముఖ్య నాయకులు కూటమి పార్టీల కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
అదివారం 18-10-2026

సినిమా న్యూస్

'స్లమ్‌డాగ్-33' షూటింగ్ పూర్తి!



డైనమిక్ డైరెక్టర్ పూరి జగన్నాథ్, కోలీవుడ్ స్టార్ విజయ్ సేతుపతి క్రేజీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న లేటెస్ట్ పాన్ ఇండియా చిత్రం 'స్లమ్‌డాగ్-33 టెంపుల్ రోడ్'. పూరి కనెక్ట్స్ బ్యానర్‌పై పూరి జగన్నాథ్, ఛార్మీ కౌర్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ భారీ ప్రాజెక్ట్‌లో టబు, జరీనా వహాబ్‌లతో పాటు గ్లామరస్ బ్యూటీ సంయుక్త మీనన్ కీలక పాత్రల్లో కనిపిస్తుండగా, రమేష్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు. తాజాగా, ఈ సినిమాకి సంబంధించిన షూటింగ్ పనులు మొత్తం పూర్తయినట్లు ప్రకటిస్తూ ఒక పిక్‌ను సోషల్ మీడియాలో షేర్ చేశారు. 'స్లమ్‌డాగ్ - 33 టెంపుల్ రోడ్' షూటింగ్ పూర్తయింది.

మిమ్మల్ని ఒక అద్భుతమైన భావోద్వేగాల రోలర్‌కోస్టర్ రైడ్‌లోకి తీసుకెళ్లడానికి మా టీమ్ సిద్ధంగా ఉంది. త్వరలోనే బిగ్ స్క్రీన్లపై కలుద్దాం" అంటూ మూవీ టీమ్ క్రేజీ క్యాప్షన్ జత చేసింది. తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో ఏకకాలంలో విడుదల కాబోతున్న ఈ పవర్‌ఫుల్ యాక్షన్ ఎమోషనల్ డ్రామా రిలీజ్ డేట్‌ను త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నట్లు మేకర్స్ స్పష్టం చేశారు. పూరి జగన్నాథ్ మార్క్ టేకింగ్, విజయ్ సేతుపతి నటన తోడవ్వడంతో ఈ సినిమాపై ఇప్పటికే ఇండస్ట్రీలో అంచనాలు భారీగా పెరిగిపోయాయి.

అంతరిక్షం వైపు 'ఆకాశంలో ఒక తార'!

మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్, టాలెంటెడ్ డైరెక్టర్ పవన్ సాదినేని కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మూవీ 'ఆకాశంలో ఒక తార'. ఈ సినిమాతో సాత్విక వీరవల్లి హీరోయిన్‌గా ఇండస్ట్రీకి పరిచయం అవుతుండటం విశేషం. లైట్‌బాక్స్ మీడియా బ్యానర్‌పై సందీప్ గుణ్ణం, రమ్య గుణ్ణం నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని స్వప్న సినిమా, గీతా ఆర్ట్స్ సంయుక్తంగా సమర్పిస్తున్నాయి.ఈ చిత్రం నవంబర్ 20న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కాబోతోంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్ ప్రారంభించిన మూవీ మేకర్స్.. తాజాగా 'ఆకాశంలో ఒక తార' టీజర్‌ను విడుదల చేశారు.

"కల తనది.. నమ్మకం కృష్ణది.. కానీ ప్రయాణం వారిద్దరిది" అనే ఇంట్రెస్టింగ్ క్యాప్షన్‌తో వదిలిన ఈ టీజర్ విశేషంగా ఆకట్టుకుంటోంది. టీజర్ విషయానికి వస్తే.. చదువంటే ఎంతో ఇష్టమున్న కల్పన అనే అమ్మాయి జిల్లా స్థాయిలో ఫస్ట్ ర్యాంక్ సాధించి ఊరికి మంచి పేరు తెచ్చిందనే వాయిస్ ఓవర్‌తో ప్రారంభమవుతుంది. 'అమ్ములు నువ్వు కష్టపడి చదువుతానంటే.. నేను చదివిస్తా" అని చెప్పే హృదయానికి హత్తుకునే డైలాగ్‌తో దుల్కర్ సల్మాన్ కృష్ణ పాత్రలో ఎంట్రీ ఆకట్టుకుంటుంది. పల్లెటూరి అమ్మాయిగా సాత్విక వీరవల్లి తన నటనతో మెప్పించింది. తల్లిదండ్రులు ఇంటికే పరిమితం చేయాలని చూసినా, భర్త కృష్ణ ఆమెను చదివించి అంతరిక్షం వరకు వెళ్లేలా ప్రోత్సహిస్తాడు. ఇక ఈ క్రమంలోనే శృతి హాసన్ సిగరెట్ తాగుతూ ఊరమాస్ అవతార్‌లో ఇచ్చిన ఎంట్రీ టీజర్‌కే హైలైట్‌గా నిలిచింది.



'కనకదుర్గ'గా అల్లరి నరేష్!



కామెడీ సినిమాలతో ప్రేక్షకులను విపరీతంగా అలరించిన అల్లరోడు.. ఈమధ్య కాలంలో డిఫరెంట్ అండ్ వైవిధ్యమైన పాత్రలను ఎంచుకుంటూ ఫుల్ బిజీగా గడుపుతున్నారు. ఇప్పుడు రూట్ మార్చిన అల్లరి నరేష్ భక్తి, యాక్షన్, భావోద్వేగాలు, సంగీతం కలగలిపిన ఓ పవర్‌ఫుల్ కథతో అలరించేందుకు సిద్ధమయ్యారు. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ డివోషనల్ మూవీ 'కనకదుర్గ'. ఇప్పటికే పూజా కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. ఈనేపథ్యంలో.. తాజాగా, నవరాత్రి శుభ సందర్భంగా మూవీ మేకర్స్ ఈ సినిమా నుంచి అల్లరి నరేష్ పవర్‌ఫుల్ పోస్టర్‌ను విడుదల చేశారు.

'ప్రతి ప్రార్థనలోనూ ఒక శక్తి ఉంటుంది.. ఈ నవరాత్రి వేళ దైవిక స్త్రీ శక్తిని ఆరాధిస్తూ, అమ్మవారి ఆశీస్సులు కోరుకుంటూ మా 'కనకదుర్గ' చిత్రాన్ని పరిచయం చేస్తున్నాం. త్వరలోనే మొదటి పాట కూడా రాబోతోంది' అంటూ క్యాప్షన్ జత చేశారు. ఇక పోస్టర్‌లో ఆరెంజ్ కలర్ దుస్తుల్లో డ్యాన్స్ చేస్తూ ఒక భక్తుడిగా, స్వామివారి లుక్‌లో నరేష్ కనిపించిన తీరు ఆకట్టుకుంటోంది. కాగా.. బిర్లా స్టూడియోస్, టెంపుల్ టౌన్ పిక్చర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ప్రదీప్ మద్దాలి తెరకెక్కిస్తున్నారు. బి.వి.ఎస్. రవి కథ అందిస్తుండగా.. మ్యూజికల్ సెన్సేషన్ ఎస్.ఎస్. తమన్ సంగీతం అందిస్తున్నారు. అల్లరి నరేష్ సరసన కాజల్ చౌదరి హీరోయిన్‌గా నటిస్తోంది.

ఓటీటీలోకి 'బత్తల'

కోలీవుడ్ మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి సినిమాల ఎంపికలో ఎప్పుడూ డిఫరెంట్‌గానే ఉంటారు. ఒకవైపు హీరోగా వైవిధ్యమైన కథలతో అలరిస్తూనే, మరోవైపు ప్రత్యేక పాత్రలతోనూ తనదైన నటనతో ప్రేక్షకులను మెప్పిస్తున్నారు. ఆయన ప్రధాన పాత్రలో నటించిన గ్యాంగ్‌స్టార్ డ్రామా 'బత్త'. బాలాజీ తరుణీతరం దర్శకత్వం వహించిన ఈ సినిమా 1986ల కాలం నాటి మద్రాస్ నేపథ్యంలో సాగే ఒక వెరైటీ గ్యాంగ్‌స్టర్ కథాంశంతో తెరకెక్కింది.ఈ చిత్రంలో మాస్టర్ సాయి పృథ్వీరాజ్, లిజోమోల్ జోస్, అజయ్ ఘోష్, అర్జున్ చిదంబరం కీలక పాత్రల్లో నటించారు. అక్టోబర్ 1న థియేటర్లలోకి వచ్చిన ఈ సినిమా ప్రేక్షకులను పెద్దగా మెప్పించలేకపోయింది.



బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో రాణించలేకపోయిన ఈ చిత్రం, ఇప్పుడు డిజిటల్ స్ట్రీమింగ్‌కు సిద్ధమైనట్లు సమాచారం. ఈ సినిమా డిజిటల్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ భారీ ధరకు సొంతం చేసుకుంది. తాజా సమాచారం ప్రకారం, ఈ చిత్రాన్ని అక్టోబర్ 29 నుంచి స్ట్రీమింగ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నారు. అంతేకాకుండా తెలుగు, తమిళం, మలయాళం, కన్నడతో పాటు హిందీలోనూ ఒకేసారి ఈ సినిమా అందుబాటులోకి రాబోతున్నట్లు టాక్ నడుస్తోంది. థియేటర్లలో మిస్సయిన విజయ్ సేతుపతి ఫ్యాన్స్, ఈ డిఫరెంట్ గ్యాంగ్‌స్టర్ డ్రామాను ఓటీటీలో చూసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.

లతా రెడ్డి ఎంట్రీ అదిరింది!

టాలీవుడ్ విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్ కాంబినేషన్‌లో ఒక క్రేజీ మల్టీస్టారర్ రాబోతోంది. 'బావ బామ్మర్ది సొజన్యంతో' అనే సరదా ట్యాగ్‌లైన్‌తో రూపొందుతున్న ఈ సినిమాకి 'జనవరి 12 విడుదల' అనే వెరైటీ టైటిల్ ఖరారు చేసిన సంగతి తెలిసిందే. మోస్ట్ సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మిస్తున్నారు. ఇక ఈ సినిమాలో నేషనల్ అవార్డ్ విన్నర్ కీర్తి సురేష్, కృతి శెట్టి హీరోయిన్లుగా నటిస్తున్నారు.

నేడు కీర్తి సురేష్ పుట్టినరోజు కావడంతో, చిత్ర యూనిట్ ఆమెకు స్పెషల్ విష్‌చేస్తూ మూవీ నుంచి ఒక సరికొత్త పోస్టర్‌ను రివీల్ చేసింది. ఈ చిత్రంలో కీర్తి 'లతా రెడ్డి' అనే పక్కా నాటీ, మాస్ పల్లెటూరి పాత్రలో కనిపిస్తుందని మేకర్స్ స్పష్టం చేశారు. విడుదల చేసిన పోస్టర్‌లో కీర్తి సురేష్ లంగాఓణి కట్టుకుని, తలకు రుమాల్ చుట్టుకుని ట్రాక్టర్ నడుపుతూ కనిపించారు. ఈ పోస్టర్ చూస్తుంటే సంక్రాంతికి థియేటర్లలో కీర్తి అల్లరి మామూలుగా ఉండదనిపిస్తోంది. జీవి ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం షూటింగ్ చివరి దశకు చేరుకున్నట్లు తెలుస్తోంది. వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 12న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.

